క్లుప్తంగా

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. లింగంపేట గ్రామానికి రూ. 10 లక్షలు, పొల్కంపేటకు రూ. 5 లక్షలు, కొర్పోల్ రూ. 5 లక్షలు, బానాపూర్‌కు రూ. 5 లక్షలు, లింగంపల్లి(ఖుర్దు) రూ. 5 లక్షలు, ముంబోజీపేట రూ. 10 లక్షలు, శెట్పల్లిసంగారెడ్డి రూ. 5 లక్షలు, శెట్పల్లి రూ. 5 లక్షలు, భవానిపేట రూ. 5 లక్షలు, పోతాయిపల్లికి రూ. 5 లక్షలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

మత్తడి పోచమ్మ ఆలయానికి విరాళం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గౌడసంఘం ఆధ్వర్యంలో రూ. 2,01,000 మంగళవారం మత్తడి పోచమ్మ ఆలయ కమిటీకి అందజేశారు. అలాగే అంబేడ్కర్ ఎస్సీ మాల సంఘం నుంచి రూ.12,501 ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, బుర్ర నారాగౌడ్, మారుతి, సంగయ్య, కౌడ రవి, తదితరులు పాల్గొన్నారు.

శబరిమల ఆలయానికి 34 క్వింటాళ్ల బియ్యం అందజేత

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన భక్తులు కేరళలోని శబరిమలలో కొలువుదీరిన అయ్యప్పస్వామి ఆలయానికి 34 క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగా అందించారు. మంగళవారం గురుస్వాములు డిష్ రాజు ఆధ్వర్యంలో భక్తులు అందించిన బియ్యాన్ని శబరిమలలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన సత్రానికి తరలిస్తున్నామని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంతం నుంచి భక్తులు అందించిన బియ్యం, పప్పు దినుసులను శబరిమలకు లారీలో పంపిస్తున్నామని గురుస్వాములు పేర్కొన్నారు. హన్మండ్లు స్వామి, సాయిలు, సంతోష్, లక్ష్మణ్ తదితరులున్నారు.

బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా కుమ్మరి యాదగిరి



పిట్లం(జుక్కల్): బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా పిట్లంకు చెందిన కుమ్మరి యాదగిరిని ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎన్నిక అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేతకు, ఇతర రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చింతల శంకర్, రాజయ్య, శ్రావణ్ కుమార్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజేందర్, సదాశివ నగర్ మండల ఇన్‌చార్జి రాజు పాల్గొన్నారు.

గిరిజన యువకుడికి పీహెచ్‌డీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని లొంకతండాకు చెందిన శంకర్ నాయక్, గినీబాయి కుమారుడు సురేందర్ వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యం తదితర అంశాలపై పరిశోధన చేసి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందాడు. సురేందర్ కామారెడ్డిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ బీఎస్సీ ఫారెస్ట్రీ చదివాడు. చెన్నైలో భారతి ధాశన్ విశ్వ విద్యాలయం నుంచి పీజీ పూర్తి చేశాడు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అటవీ, వాతావరణ మార్పు విభాగంలో సీనియర్ సైంటిస్టుగా, అదనపు డైరెక్టర్‌గా నాగ్‌పూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. యువకుడిని పలువురు అభినందించారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారితోపాటు సీటు బెల్టులు పెట్టుకోని, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపితే కోర్టుకు పంపిస్తామని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, ఇచ్చిన వారు, నడిపించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కులం పేరుతో దూషించొద్దు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ఎవరినైనా కులం పేరుతో దూషించవద్దని నాగిరెడ్డిపేట ఆర్ఐ మహ్మద్ సూచించారు. గోలిలింగాలలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. ఎస్సీ హాస్టల్ వార్డెన్ రాములు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: ప్రతి పౌరుడు పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల గిర్దావర్ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్వన్నపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు.

నిలిచిన ‘డబుల్’ ఇళ్ల నిర్మాణం

- నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా విడుదలకాని నిధులు
- ఆశగా ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు
- ప్రభుత్వ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు





అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణం.. ఇబ్రహీంపేట్‌లో నాలుగేళ్ల క్రితం వేసిన శిలాఫలకం

బాన్సువాడ రూరల్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే సదుద్దేశంతో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకం నిధుల లేమితో అభాసుపాలవుతోంది. బాన్సువాడ మండలం ఇబ్రాహీంపేట్ గ్రామంలో 50 సామూహిక డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి 2021 జనవరి 8న రూ.2 కోట్ల 52 లక్షల నిధులతో అప్పటి స్పీకర్ , ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు వెనువెంటనే పూర్తిచేయాలని ఆదేశించడంతో కాంట్రాక్టర్‌తో అధికారులు దగ్గరుండి పనులు ప్రారంభించారు. అప్పటికే గ్రామంలో 50 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయడంతో కొంత మంది మిగిలిపోయారు. మిగిలిపోయిన దరఖాస్తుదారులు పనులు ప్రారంభం కావడంతో ఎంతో సంబురపడ్డారు. ఇక తమ సొంతింటి కల నెరవేరినట్టేనని ఆశపడ్డారు. నాలుగేళ్లయినా నిర్మాణం పూర్తికాకపోవడంతో వారు ఆశలు వదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నిధులు విడుదలైతేనే ముందుకు..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బేస్‌మెంట్, పిల్లర్స్, స్లాబ్ పనులు పూర్తిచేశారు. వెంటనే నిధులు విడులైతే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 50 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు పంపిణీ కూడా జరిగేది. నిధుల విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడం నిధులు విడుదలకు డబుల్ బ్రేక్ పడింది.

చిగురిస్తున్న ఆశలు..

ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి నిధులు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించడంతో కొంత ఆశలు చిగురించాయి. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా నియమితులవడంతో నిధులు మంజూరు అవుతాయని గ్రామస్తులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు స్పందించి ఇబ్రాహింపేట్ గ్రామంతో పాటు మరిన్ని గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిన డబుల్‌బెడ్‌రూం ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించకపోవడంతో..

కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు. నిర్మాణం పూర్తిచేయాలని పలుమార్లు సూచించాం. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణాల పూర్తికోసం నిధులు విడుదల చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. నిధులు విడుదల కాగానే పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారు.

– గోపీనాథ్, ఏఈ, బాన్సువాడ

విధుల్లో జాగ్రత్తగా ఉండాలి



బీబీపేట: పాఠశాలలో విధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నూతనంగా నియమించిన ఇద్దరు వంట సిబ్బంది, అటెండర్‌తో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారితో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంఈవో అశోక్, సిబ్బంది ఉన్నారు.

మొగి పురుగును తొలి దశలోనే నివారించాలి



బాన్సువాడ రూరల్: వరిలో మొగి పురుగును తొలి దశలోనే గుర్తించి నివారించాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మిఫ్తా ఫైజుల్లా రైతులకు సూచించారు. ఆయన మంగళవారం చిన్నరాంపూర్, బోర్లం గ్రామాల శివార్లలో గల వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. వరి పంటలో మోగి పురుగు గుర్తించి దానికి తగిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఈవోలు దత్తేశ్వరి, రాణి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. పప్పులతో పాటు తాజాగా ఉండే కూరగాయలు, ఆకుకూరలను వాడాలని సూచించారు. వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలం ఉంటే మొక్కలు నాటాలన్నారు. తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీవో సవితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుపై శ్రద్ధ పెట్టాలి

నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి సూచించారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పలు విషయాల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో అంగన్‌వాడి టీచర్లు శైలజ, వజ్ర, సంగమణి, పుష్ప, సరస్వతి, పార్వతి, స్వప్న, గంగామణి తదితరులున్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

–గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామేశ్వర్‌పల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడు రాజిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌గౌడ్, తక్కళ్ల బాపురెడ్డి, మద్ది సూర్యకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలి



బాన్సువాడ: వచ్చే ఈ 3 నెలలు విద్యార్థుల జీవితంలో కీలకమని, అందుకే విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా నోడల్ అధికారి సలాం అన్నారు. మంగళవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముందుగా కళాశాలలో విద్యాబోధన గురించి విద్యార్థులతో మాట్లాడించారు. అనంతరం అధికారి మాట్లాడుతూ.. మార్చిలో వార్షిక పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఇప్పటి నుంచి ప్రణాళికలు వేసుకుని చదవాలని అన్నారు. అధ్యాపకులు రుక్మిణీ, జలీల్, స్వరూప్, యాదగౌడ్, హఫీజ్, ఇక్బాల్, సమీ, మక్బూల్, నరేష్, జలీల్, దయానంద్, కార్తీక్, స్వప్న తదితరులున్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో ఆయా వార్డులో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను చెల్లించాలని కోరుతూ 23, 29, 38వ వార్డుల కౌన్సిలర్లు తేజపు మానస, అస్మాబేగం, చాట్ల రాజేశ్వర్ తదితరులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ స్పందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనరల్, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వార్డుల్లో పనులు చేశామని రెండేళ్లుగా బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తక్షణమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రసాద్, మోహన్ తదితరులున్నారు.

దోమకొండ ఎస్సై బదిలీ



దోమకొండ: దోమకొండ ఎస్సై ఆంజనేయులు బదిలీ అయ్యారు. ఆయన నాలుగు నెలల క్రితం సిరిసిల్ల జిల్లా కోనరావుపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆయన భిక్కనూరుకు బదిలీ అయ్యారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఆంజనేయులును భిక్కనూరుకు బదిలీ చేసినట్లు తెలిసింది. బుధవారం బాధ్యతలు తీసుకుంటానని ఎస్సై తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తకాలతో జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు



ఇన్‌చార్జి కవితారెడ్డిని సన్మానిస్తున్న అరుణతార

- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార

బిచ్కుంద(జుక్కల్) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. బిచ్కుంద గ్రంథాలయానికి మంగళవారం జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణతార చేతుల మీదుగా పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నిచర్ కావాలి.. మీ ఫౌండేషన్ ద్వారా ఇవ్వాలని కోరడంతో జేడీ ఫౌండేషన్ ఇన్‌చార్జి కవితారెడ్డి స్పందించి పుస్తకాలు, కుర్చీలు, టేబుల్స్, ర్యాక్స్ అందించారని అన్నారు. ఒక పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని అన్నారు. నిరుద్యోగులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని మంచి కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. ఏళ్ల తరబడి గ్రంథాలయాలకు ప్రభుత్వాలు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. జేడీ ఫౌండేషన్ స్పందించి పుస్తకాలు, ఫర్నిచర్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఫౌండేషన్ కన్వీనర్ సాయి మోహన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో బోరుమోటారు ప్రారంభం

ఎల్లారెడ్డి: పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల ఎస్సీ కాలనీలో మున్సిపల్ చైర్మెన్ పద్మ శ్రీకాంత్ మంగళవారం బోరు మోటారును ప్రారంభించారు. కాలనీలో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొనడంతో బోరు మోటారు బిగించి కాలనీ వాసులకు నీటి ఎద్దడిని తీర్చినట్లు కౌన్సిలర్ బాలమణి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నీలకంఠం, పోచయ్య, విద్యాసాగర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సాక్షి కథనాలకు సబ్ కలెక్టర్ స్పందన

- అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖాధికారులకు ఆదేశం
- మొరం తరలించిన ప్రదేశం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



దుర్కిలో మొరం తరలించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ శాఖాధికారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో మొరం అక్రమ తరలింపుపై సాక్షిలో వస్తున్న వరుస కథనాలకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు. మంగళవారం సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేష్ దుర్కిలో మొరం తరలిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. నిత్యం మొరం తరలిస్తున్న ప్రదేశాలపై రెవెన్యూ అధికారులు నిఘా ఉంచాలన్నారు. మొరం తరలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్, గిర్దావర్ సాయిలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నామమాత్రపు జరిమానాలు

ఇటీవల మైలారం గ్రామంలో మొరం తలిస్తూ పట్టుబడిన పొక్లెయిన్, టిప్పర్‌లకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ఒక్క మొరం టిప్పర్ ధర రూ.4 వేల నుంచి రూ.5 వేలకు విక్రయిస్తే టిప్పరుకు రూ.5 వేలు, పొక్లెయిన్‌కి రూ.5 వేలు జరిమానా విధించి వదిలేశారు. రోజంతా మొరం అమ్ముకున్న మాఫీయాకు ఇది కేవలం నామ మాత్రపు జరిమానా విధించారనే చెప్పవచ్చు. అలాగే దుర్కిలో తప్పిపోయిన వాహనాల యజమానులు తెలిసినా కూడా వారిపై చర్యలు తీసుకోకుండా తమ పరిధిలోకి రాదంటూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉంది.

‘మధ్యాహ్న భోజనం’ ప్రారంభానికి చర్యలు



పాఠశాలలో హెచ్‌ఎంతో సమావేశమైన గ్రామపెద్దలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు నెలలుగా నిలిచిపోయిన మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం గ్రామస్తులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయమై ‘సాక్షి’ దినపత్రికలో ‘ఇంటి భోజనమే దిక్కు’ అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి గ్రామస్తులు స్పందించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు, గ్రామపెద్దలు లచ్చాగౌడ్ తదితరులు పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం అనసూజతో మాట్లాడారు. అలాగే గతంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండిన వ్యక్తిని పిలిచి మాట్లాడారు. పాఠశాలలో మళ్లీ మధ్యాహ్న భోజన ఏజెన్సీగా పని చేయాలని వారు సూచించారు. అందుకు ఆ వ్యక్తి అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయిస్తామని హెచ్‌ఎం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘం నాయకులు

బాన్సువాడ: ప్రభుత్వ రంగాల్లో అమలు చేస్తున్న రిజర్వేషన్లను ప్రైవేటు రంగాల్లో కూడా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాల సంఘం డివిజన్ నాయకులు ప్రశాంత్, బంగారు మైశయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కార్పొరేషన్లలో దళిత బంధు, మూడెకరాల భూ పంపిణీ, ఏ కులానికి ఎక్కువ లబ్ధి చేకూరిందో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని అన్నారు. బీఎడ్, డీఎడ్ ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, దేశంలో ఉన్న భూములను జాతీయం చేయాలని, కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించాలని అన్నారు. జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లను 30 శాతానికి పెంచాలని అన్నారు. మాల సంఘం వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, నాయకులు గైని రవి, సంతోష్, నీరడి ప్రశాంత్, తదితరులున్నారు.

‘ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పోతోంది’

- 22వ రోజుకు చేరిన సమ్మె



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పోతోందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించా లని చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారంతో 22వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద రోడ్డుపై ఒంటికాలిపై నిలబ డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారా యణ మాట్లాడుతూ..ఇప్పటికై నా తమను క్రమబద్ధీకరణ చేసి, విద్యాశాఖలో విలీనం చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్, రాములు, కాళిదాసు, శైలజ, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టీఎన్జీవోస్ మద్దతు

ఉద్యోగుల సమ్మెకు టీఎన్జీవోస్ జిల్లా శాఖ తరపున పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్లు అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సమ్మె శిబిరానికి హాజరై ప్రకటించారు. అలాగే భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి విఠల్, తపస్ సంఘం నాయకులు మద్దతు ప్రకటించి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



భిక్కనూరు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భిక్కనూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లోరూ.100 చెల్లించి ప్రవేశం కోసం ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశపరీక్ష ఉంటుందని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గురుకుల వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం పలువురు ఆవిష్కరించారు. రాజంపేట మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్‌టీయూ 2025 క్యాలెండర్‌ను ఎంఈవో పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రఘురాం చేతుల మీదుగా, అలాగే నస్రుల్లాబాద్ ఎమ్మార్సీ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను ఎంఈవో చందర్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం కామారెడ్డి జిల్లా శాఖకు సంబంధించిన క్యాలెండర్‌ను హైదరాబాద్‌లో మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అలాగే ఎల్లారెడ్డి సొసైటీ క్యాలెండర్లను చైర్మన్ ఏగుల నర్సింలు ఆవిష్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క



రాజంపేటలో పీఆర్‌టీయూ క్యాలెండర్.. ఎంఈవో పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రఘురాం



నస్రుల్లాబాద్ పీఆర్‌టీయూ క్యాలెండర్.. ఎంఈవో చందర్



ఎల్లారెడ్డి సొసైటీలో.. చైర్మన్ నర్సింలు